క్లుప్తంగా

ఈ-పంటల నమోదు జాగ్రత్తగా చేయండి



మాట్లాడుతున్న ఏడీఏ యల్లప్ప

కళ్యాణదుర్గం రూరల్: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన రైతుల వివరాలను ఈ -పంట యాప్‌లో జాగ్రత్తగా నమోదు చేయాలని ఏడీఏ యల్లప్ప సూచించారు. కళ్యాణదుర్గం ఆర్‌బీకేలో శుక్రవారం ఈ-పంటల నమోదుపై వ్యవసాయ శాఖ అసిస్టెంట్లకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గడువులోపు ఈ-పంటల నమోదు యాప్‌లో రైతుల వివరాలు పొందుపరచాలన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం ఈ-పంటల నమోదుకు తీసుకోవాల్సిన పలు సూచనలను ఆయన వివరించారు. కార్యక్రమంలో డివిజన్‌లోని ఆరు మండలాల ఏఓలు, సిబ్బంది పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాలు నిర్మాణానికి భూమి పూజ



పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ, సర్పంచ్

కూడేరు: మండలంలోని పి.నారాయణపురంలో శుక్రవారం కమ్యూనిటి హాలు భవన నిర్మాణానికి ఎంపీపీ నారాయణ రెడ్డి భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. మండల గ్రాంట్ కింద రూ.12 లక్షలతో కమ్యూనిటీ హాలు నిర్మిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ భవన నిర్మాణం పూర్తయితే గ్రామ సభలు నిర్వహించడానికి వీలుగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు బైరెడ్డి రామచంద్రారెడ్డి, మాధవ రెడ్డి, శిద్దారెడ్డి, శంకరయ్య, పంచాయతీ కార్యదర్శి హరి తదితరులు పాల్గొన్నారు.

ఓటరు జాబితాపై సమావేశం



మాట్లాడుతున్న తహసీల్దార్ శేషారెడ్డి

కూడేరు: ఓటరు జాబితాలో అభ్యంతరాలుంటే బూత్‌లెవల్ ఏజెంట్(బీఎల్ఏ) ద్వారా తెలపాలని తహసీల్దార్ శేషారెడ్డి రాజకీయ పార్టీల నేతలకు సూచించారు. ఓటర్ జాబితా పరిశీలనపై శుక్రవారం ఆయన తన చాంబర్‌లో రాజకీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ మండలంలో ఓటరు జాబితా పరిశీలన కార్యక్రమం జరుగుతోందన్నారు. అధికారుల వెంట మీ పార్టీలకు చెందిన బీఎల్ఏలను పంపి ఓటరు జాబితా సరిచూసుకోవాలన్నారు. తప్పుల్లేని ఓటరు జాబితా కోసం అన్ని రాజకీయ పార్టీల నేతలు సహకరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో డీటీ విశ్వనాథ్, ఆర్ఐ ప్రసన్న కుమార్, వివిధ రాజకీయ పార్టీలకు చెందిన నేతలు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై విచారణ



జెల్లిపల్లిలో విచారణ చేస్తున్న డీఎస్పీ శ్రీనివాసులు

కంబదూరు: స్థానిక పోలీసు స్టేషన్‌లో నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై కళ్యాణదుర్గం డీఎస్పీ బి.శ్రీనివాసులు విచారణ చేపట్టారు. మండలంలోని జెల్లిపల్లి గ్రామానికి చెందిన యశోదమ్మ అనే దళిత అంగన్‌వాడీ హెల్పర్‌పై అదే గ్రామానికి చెందిన యానిమేటర్ బోయ రాధమ్మ, వారి కుటుంబ సభ్యులు దాడి చేశారు. దాడిపై పోలీసు స్టేషన్‌లో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదయింది. దీనిపై శుక్రవారం డీఎస్పీ బి.శ్రీనివాసులు జెల్లిపల్లి గ్రామానికి వెళ్లి గ్రామస్తులతో విచారణ చేపట్టారు. డీఎస్పీ వెంట సీఐ శ్రీనివాసులు, ఏఎస్ఐ ఓబుళపతి ఉన్నారు.

ప్రిన్సిపాల్‌కు అభినందనల వెల్లువ

రాయదుర్గం రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తి అదనపు బాధ్యతలు స్వీకరించిన కె.వీరేష్‌ను మండలంలోని 74 ఉడేగోళం గ్రామ లింగాయత్ కులస్తులు శుక్రవారం అభినందించారు. సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు జయణ్ణ మాట్లాడుతూ మా గ్రామానికి చెందిన వీరేష్ ఇదే కాలేజీలో చదివి , క్లర్క్ గా ఉద్యోగం చేశారన్నారు. అనంతరం తెలుగు లెక్చరర్‌గా జిల్లా కేంద్రంలో విధులు నిర్వహించారన్నారు. ఇక్కడికి బదిలీపై వచ్చిన వీరేష్ కళాశాల ప్రిన్సిపాల్ గా బాధ్యతలు తీసుకోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ లెక్చరర్ల జిల్లా సంఘం ఉపాధ్యక్షులు షణ్ముఖాచారి, చంద్రశేఖర్ (అప్పాజి), పృథ్వీ, మహానంది, సోమశేఖర్, కుమార్, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు



మాట్లాడుతున్న మంత్రి కేవీ ఉషశ్రీచరణ్



హాజరైన వివిధ మండలాల నాయకులు

- పథకాల లబ్ధిని ప్రజలకు వివరించండి
- మంత్రి కేవీ ఉషశ్రీచరణ్

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అర్హతే ప్రామాణికంగా వలంటీర్, సచివాలయ వ్యవస్థ ద్వారా పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించాం. ఇదే విషయాన్ని గ్రామాల్లో ప్రజలకు వివరించాలని రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి కేవీ ఉషశ్రీచరణ్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో పార్టీ ప్రజా ప్రతినిధులు, ముఖ్య నాయకులతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ రాబోవు రోజులు ఎంతో కీలకమన్నారు. గ్రామాల్లో బూత్ స్థాయిలో నాయకులు, కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా అందిన లబ్ధిని చూడాలని ప్రజలకు తెలియజేయాలన్నారు. ఆయా బూత్‌ల వారీగా ఎంపిక చేసిన బీఎల్ఏలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితాను పరిశీలించుకోవాలన్నారు. ఇటీవల టీడీపీ దొంగ ఓట్లను తెరపైకి తెచ్చిందన్నారు. కేవలం ఎన్నికల్లో గెలుపు కోసం అడ్డదారులు తొక్కుతుందని మంత్రి విమర్శించారు. టీడీపీ నాయకులు బీఎల్ఏలతో వెళ్లి కొన్ని చోట్ల ఓటర్ల వివరాలను రహస్యంగా నమోదు చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి సంఘటనలు తెలిస్తే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. కళ్యాణదుర్గంలో మరోసారి పార్టీ జెండా ఎగురవేసేందుకు అందరూ సమష్టిగా ముందుకు వెళ్దామన్నారు. ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా పార్టీ అధిష్టానం సూచన మేరకు గ్రామాల్లో పార్టీని మరింత పటిష్టం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. నమ్మకంగా పనిచేసిన వారికి ఎల్లప్పుడూ పార్టీ అండగా ఉంటుందనే విషయాన్ని కార్యకర్తలు గుర్తుంచుకోవాలన్నారు. పార్టీ బలోపేతానికి అన్ని వర్గాలు, కులాల వారిని కలుపుకుని ముందుకెళ్లాలని మరోసారి మంత్రి స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జయం ఫణి, పార్టీ పట్టణ కన్వీనర్ గోపారం శ్రీనివాసులు, మండల కన్వీనర్లు సర్వోత్తమ, బసవరాజు, సత్యనారాయణశాస్త్రి, జెడ్పీటీసీ రాధాస్వామి, జేసీఎస్ కన్వీనర్లు అర్చన, చంద్రశేఖర్‌రెడ్డి, పెరుగు తిమ్మరాజు, గంగాధర్, రాము, ఆంజినేయులు, నియోజకవర్గంలోని అన్ని మండలాల జెడ్పీటీసీ, ఎంపీపీలు, సర్పంచులు, మండల కన్వీనర్లు, వివిధ అనుబంధ సంఘాల చైర్మెన్లు, డైరెక్టర్లు, ముఖ్య నాయకులు, బీఎల్ఏలు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమం, అభివృద్ధి



మహిళలకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

విడపనకల్లు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం, అభివృద్ధి సాధ్యమని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే, ఇన్‌చార్జ్ వై.విశ్వేశ్వరరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని పాలికిలో రెండో రోజు గడప గడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారన్నారు. గత టీడీపీ పాలనలో కేవలం పచ్చా చొక్కాలు వేసుకున్న వారికే సంక్షేమ పథకాలు అందేవని, జగన్ ముఖ్యమంత్రి అయ్యాక అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం పుష్పావతి, జెడ్పీటీసీ హనుమంతు, వైస్ ఎంపీపీ రాకెట్ల పుష్పావతి, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సీపీ వీరన్న, మాజీ సర్పంచు భీంరెడ్డి, ఎస్సీ సెల్ జిల్లా నాయకుడు సుంకన్న, సర్పంచు బోయ దేవేంద్ర, గాజుల చిన్న వెంకటేశులు, పెద్ద వెంకటేశులు, అంగడి శీనా, నాగమ్మ, నాగిరెడ్డి, జంగం మల్లయ్య, వరదారెడ్డి, బోయ వెంకటేశులు, చంద్రశేఖర్‌రెడ్డి, సుంకన్న, నెట్టిప్ప, ఎంపీడీఓ శ్రీనివాసులు, తహసీల్దార్ ఈరమ్మ తదితరులు పాల్గొన్నారు.

మహిళల జీవితాల్లో వెలుగు..

మహిళలను అన్ని రంగాల్లో అందలం ఎక్కించడమే కాకుండా, ఆర్థికంగా, రాజకీయంగా పీట వేసి, వారి జీవితాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెలుగులు నింపారని మాజీ ఎమ్మెల్యే అన్నారు. పాలికిలో ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సీఎం జగన్ వల్లే మహిళా సాధికారత సాధ్యమని, మహిళలు అన్నీ రంగాల్లో రాణించాన్నదే జగన్ లక్ష్యమన్నారు. మహిళల కోసం జగన్ ఇంతా చేస్తున్నా ప్రతిపక్షనేత చంద్రబాబు అండ్ కో.. ఎల్లో మీడియా బురదజల్లుతూ దుష్ప్రారం చేస్తున్నాయని ధ్వజమెత్తారు. చంద్రబాబు మాదిరిగా మహిళలను మోసం చేసే నైజం జగన్‌ది కాదన్నారు. ఎల్లో మీడియా ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా రాష్ట్రంలో మహిళలు జగన్‌కు అండగా ఉంటారన్నారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

రాయదుర్గం రూరల్/విడపనకల్లు/కూడేరు/కంబదూరు/కుందుర్పి: ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటాలని ఎంపీడీఓ కొండయ్య అన్నారు. పర్యావరణ పరిరక్షణ దినోత్సవంలో భాగంగా రాయదుర్గం ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం ఆయన సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఏపీఓ నీరజ, సీనియర్ అసిస్టెంట్ రవిచంద్రశేఖర్ , శివారెడ్డి, నారాయణ నాయక్, అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు. అలాగే విడపనకల్లు మండంలోని గడేకల్లులో సచివాలయ భవన ఆవరణలో ఎంపీపీ కరణం పుష్పావతి, సచివాలయ సిబ్బంది, వైఎస్సార్‌సీపీ నాయకులు మొక్కలను నాటారు. సర్పంచు సుశీల, మాజీ సర్పంచు కరణం భీంరెడ్డి, ఎంపీటీసీ ఓబుళేసు తదితరులు పాల్గొన్నారు. అదేవిధంగా కూడేరులోని బసాపురం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఉపాధి పథకం ద్వారా 5 ఎకరాల్లో 400 మొక్కలు(బ్లాక్ ప్లాంటేషన్) నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఎంపీపీ నారాయణరెడ్డి, వైస్ ఎంపీపీ దేవ, అగ్రి అడ్వైజరీ మండల చైర్‌పర్సన్ నిర్మలమ్మ, వైఎస్సార్ సీపీ నేతలు బైరెడ్డి రామచంద్రారెడ్డి, ఏఓ నాగభూషణరెడ్డి, ఏపీఓ తులసీ ప్రసాద్, ఇంజనీర్ రవికుమార్, ఫీల్డ్,టెక్నికల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు. కంబదూరు మండలంలోని వైసీపల్లి గ్రామంలో ఆర్డీటీ ఏకాలజీ సెంటర్ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. రాంపురం సర్పంచ్ చెన్నయ్య, ఆర్డీటీ ఎస్టీఎల్ రామకృష్ణ, ఎస్టీఓ వన్నూరప్ప, సీఓ రవికుమార్ పాల్గొన్నారు. అలాగే మండలంలోని కరిగానిపల్లిలో ఎస్కే చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో 2వేల మొక్కలను నాటారు. ట్రస్టు వ్యవస్థాపకుడు లెనిన్‌బాబు, డిస్కవర్ చానల్ అధినేత అనిల్‌కుమార్, అటవీశాఖ డిప్యూటీ రేంజ్ ఆఫీసర్ బ్రహ్మయ్య, స్థానిక ప్రజాప్రతినిధులు, ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

బెళుగుప్ప: పశు పోషకులు గొర్రెలు, మేకలు, పాడి ఆవులు, ఎద్దులు, గేదెలకు సీజనల్ వ్యాధులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మండల పశు వైద్యాధికారి రమేష్ సూచించారు. శుక్రవారం మండలంలోని బెళుగుప్ప తండా, బెళుగుప్ప గ్రామాల్లో పశు విజ్ఞానబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో గొర్రెలు, మేక పిల్లలు చల్లటి ఈదురుగాలులకు చనిపోయే ప్రమాదం ఉందన్నారు. గొర్రె పిల్లలు మట్టిని తినడం మూలంగా పొరుకుని అనారోగ్యం బారిన పడి చనిపోయే అవకాశం ఉందన్నారు. అనంతరం కాపరులకు, రైతులకు ఉచితంగా రోగ నివారణ, రోగ నిరోధక శక్తి పెంపొందించే మందులు, మాత్రలను, దగ్గు మందులను ఉచితంగా అందించారు.

రేషన్ డీలర్ల సమావేశం

కూడేరు: రేషన్ షాపు డీలర్లతో శుక్రవారం సీఎస్‌డీటీ లక్ష్మీదేవి సమావేశం నిర్వహించారు. మండల వ్యాప్తంగా 30 మంది డీలర్లుండగా ఐదారుగురు చెప్పిన సమయానికి వచ్చారు. దీంతో డీలర్ల నిర్లక్ష్య తీరుపై సీఎస్‌డీటీ మండిపడ్డారు. నెలకోసారి నిర్వహించే సమావేశానికే హాజరు కాకపోతే ఎలా అని ప్రశ్నించారు. ఇక నుంచి డీలర్లంతా సమావేశానికి హాజరు కావాలని గైర్హాజరైతే రూ.1000 జరిమానా చెల్లించాల్సి ఉంటుందని ఆమె హెచ్చరించారు.

వ్యక్తి ఆత్మహత్యాయత్నం

విడపనకల్లు: మండలంలోని పాల్తూరు గ్రామానికి చెందిన బోయ వన్నప్ప పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ కలహాలతో శుక్రవారం తెల్లవారుజామున ఇంట్లో పురుగుల మందు తాగాడు. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని కుటుంబ సభ్యులు ఉరవకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సలహా మేరకు అనంతపురం ఆస్పత్రికి తరలించారు. అలాగే పాల్తూరు గ్రామానికి చెందిన సురేష్ అనే యువకుడు తల్లిదండ్రులతో గొడవ పడి గురువారం అర్ధరాత్రి పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు అతడిని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పేదల సంక్షేమం కోసమే 'జగనన్న సురక్ష'

బ్రహ్మసముద్రం/వజ్రకరూరు: పేదల సంక్షేమం కోసమే జగనన్న సురక్ష పథకానికి సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నిర్వహించారని ఎంపీపీ కంభం చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమం మండలంలో శుక్రవారంతో ముగిసింది. చివరి రోజు మండలంలోని చెలిమేపల్లిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ దాసా నాయక్, తహసీల్దార్ బాలకిషన్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బసవరాజు, సర్పంచ్ రంగప్ప , ఎంపీటీసీ బూసప్ప, నాయకులు ఆంజనేయులు, చంద్రశేఖర రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే వజ్రకరూరు మండలంలోని తట్రకల్లు గ్రామ సచివాలయం వద్ద సర్పంచు ధనలక్ష్మి అధ్యక్షతన జగనన్న సురక్షపై కార్యక్రమం ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం కార్యదర్శి కమలపాడు వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ప్రసాద్‌రెడ్డి, ఎంపీపీ రమావత్‌దేవి, వైస్ ఎంపీపీ సుంకమ్మ, మార్కెట్ కమిటీ చైర్మన్ సుశీలమ్మ, బీసీ సెల్ కార్యదర్శి వీరభద్రగౌడ్, ఎంపీటీసీ రామక్రిష్ణ, తహసీల్దార్ అనిల్‌కుమార్, ఎంపీడీఓ విజయలలిత పాల్గొన్నారు.

ఈ-క్రాప్ నమోదైతేనే పంటల బీమా

డి హీరేహాళ్(రాయదుర్గం): పంటలు వేయడం ఎంత ముఖ్యమో దాన్ని ఈ-క్రాప్ నమోదు చేయించుకోవడం కూడా అంతే అవసరమనే విషయం రైతులు గుర్తించాలని ఏడీఏ లక్ష్మానాయక్ తెలిపారు. శుక్రవారం డి హీరేహాళ్ మండలంలోని సోములాపురం, నాగలాపురం, మల్లికేతి, చెర్లోపల్లి గ్రామాలలో చేపట్టిన పత్తి పంటలను టెక్నికల్ ఏఓ బాషా, సచివాలయ సిబ్బందితో కలసి పరిశీలించారు. అనంతరం సోములాపురం ఆర్‌బీకేలో సర్పంచ్ సుదర్శనరెడ్డి తో కలసి రైతులతో సమావేశం నిర్వహించారు. అధిక వర్షాల కారణంగా పత్తిని ఆశించే తెగుళ్ల, పురుగు మందుల వాడుకంపై అవగాహన కల్పించారు.

వేరుశనగలో సస్యరక్షణపై శిక్షణ

రాయదుర్గం రూరల్: వేరుశనగ పంటను సాగుచేసిన రైతులు 14 వారాల కాలంలో సస్యరక్షణ చర్యలు చేపాట్టాలని ఏఓ మహేంద్ర సూచించారు. మండలంలోని జుంజురాంపల్లి గ్రామంలోని వేరుశనగ పొలాల్లో శుక్రవారం డా.వైఎస్సార్ పొలంబడి కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వీఏఏ నాగరాజు, శివారెడ్డి, బ్రహ్మానందరెడ్డి, శరణప్ప, సత్యన్న, రైతులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మతసామరస్యానికి ప్రతీక 'మొహర్రం'

రాయదుర్గంటౌన్: మత సామరస్యానికి ప్రతీకైన మొహర్రం సందర్భంగా శనివారం పెద్ద సరిగెత్తు, ఆదివారం జలధి నిర్వహించనున్నారు. ఉచ్చు బాయి, గొందిబావిలోని పెద్దపీర్లు, బళ్ళారి రోడ్డులోని చమ్మా మకాన్, ఆత్మకూరు వీధిలోని నింబూసా, లడ్డు పీర్ల మకాన్ తదితర ప్రాంతాల్లోని చావిడిల్లో పీర్లు కొలువుదీరాయి.



రాయదుర్గంలో కొలువుదీరిన చమ్మా పీర్లు

లాలుస్వామిని దర్శించుకున్న విప్ కాపు

కణేకల్లు: మండలంలోని ఎస్.హనుమాపురం గ్రామంలో లాలుస్వామి పీర్లదేవుని ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం పెద్ద సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. లాలుస్వామి పీర్లను దర్శించుకునేందుకు వచ్చిన ప్రభుత్వ విప్ కాపు రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌని ఉపేంద్రరెడ్డికి ఆలయకమిటీ అధ్యక్షుడు, మాజీ సర్పంచు పైనేటి తిమ్మప్పచౌదరి, నిర్వాహకులు మేళాతాళాలతో ఘనంగా స్వాగతించారు. కాపు అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణలు చేశాక లాలుస్వామి పీర్లదేవుళ్లకు ప్రత్యేక ఫాతేహాలు జరిపించారు. అలాగే బ్రహ్మసముద్రం గ్రామంలో వెలసిన పీర్లదేవుళ్లను కూడా విప్ కాపు దర్శించుకుని చక్కెర ఫాతేహాలు జరిపించారు. ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

వైభవంగా పెద్ద సరిగెత్తు

ఉరవకొండ: పట్టణంలో పెద్దసరిగెత్తు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక గాంధీచౌక్ వద్ద గురికాల వీధిలో కొలువు తీరిన వన్నూర్‌స్వామిపీర్ల చావిడికి భక్తులు పొటెత్తారు. వన్నూర్‌స్వామి పీర్లను మార్కెట్‌యార్డు చైర్‌పర్సన్ బోయ సుశీలమ్మ, జెడ్పీటీసీ ఏసీ పార్వతమ్మ, వార్డు సభ్యురాలు ఓబుళమ్మలు దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు పెద్ద ఎత్తున ఊరేగింపుగా స్వామి వారికి పానకాలు సమర్పించారు. అలాగే మండల ంలోని చిన్నముష్టూరులోని వన్నూర్‌స్వామి పీర్ల చావిడికి ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తులాభారంగా నాయకులు ఆమిద్యాల చెన్నారెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ రమణయాదవ్, ముష్టూరు ఎర్రిస్వామి, మాజీ ఎంపీటీసీ విజయ్‌కుమార్, అర్జున్ 74 కిలోల చక్కెరను స్వామికి అందించి మొక్కులు తీర్చుకున్నారు.

విడపనకల్లు: మొహరం పురస్కరించుకొని పాల్తూరు,గడేకల్లు,పాలికి,విడపనకల్లు, పెద్ద కొట్టాలపల్లి, చీకలగురికి,ఉండబండ తదితర గ్రామాల్లో మసీదుల్లో పీర్ల దేవుళ్ళు కొలువు తీరాయి. శుక్రవారం పెద్ద సరిగెత్తు నిర్వహించారు. మొహర్రం ప్రశాంతగా జరుపుకోవాలని పాల్తూరు ఎస్ఐ సురేష్‌బాబు సూచించారు. శుక్రవారం మండలంలోని పాల్తూరు పోలీస్ స్టేషన్‌లో వివిధ గ్రామాలకు చెందిన ప్రజలతో సమావేశం నిర్వహించారు.

వజ్రకరూరు: మండల కేంద్రం వజ్రకరూరులోని లాలుస్వామి, కటికెలస్వామి ఆలయాల్లో పెద్ద సరిగెత్తు కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.



కణేకల్లు: ఎస్.హనుమాపురంలో లాలుస్వామి పీర్లదేవుళ్లకు ఫాతేహాలు చేయిస్తున్న విప్ కాపు



ఉరవకొండ: గురికాల వన్నూర్‌స్వామి పీర్ల చావిడి వద్దకు పానకాలు తెస్తున్న భక్తులు

తహసీల్దార్‌కు కోర్టు నోటీసులు

కళ్యాణదుర్గం: కళ్యాణదుర్గం తహసీల్దార్‌కు జిల్లా కోర్టు బెయిలబుల్ నోటీసు జారీ చేసింది. బోయలపల్లిలో జరిగిన భూ వివాదంపై తహసీల్దార్‌కు గురువారం నోటీసులు అందాయి. ఈ విషయం ఒక్కరోజు ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వివరాలిలా ఉన్నాయి. మండలంలోని బోయలపల్లికి చెందిన దళితులు సుమారు 70 కుటుంబాలు వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నాయి. సర్వే నంబర్ 56-1లోని 9.80 ఎకరాలు ప్రభుత్వ భూమి దళితులకు చెందినట్లు రెవెన్యూ అధికారులు విచారణ జరిపి నిర్ధారించారు. అయితే అదే గ్రామస్తుడు కమ్మ సామాజిక వర్గానికి చెందిన కె.తిప్పన్న అనే వ్యక్తి దళితులకు ఆ భూమి చెల్లదంటూ కోర్టులో దావా వేశాడు. విషయం తెలుసుకున్న లాయర్స్ ఫర్ సోషల్ జస్టిస్ ఆఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు, అడ్వకేట్ నారాయణప్ప దళితుల తరఫున అనంతపురం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో దావా వేశారు. ఈనెల 23న అనంతపురం కోర్టులో కేసు విచారణ ఉండగా తహసీల్దార్ ప్రతివాదిగా ఉండి కోర్టుకు హాజరుకాలేదు. దీంతో అనంతపురం కోర్టు కళ్యాణదుర్గం తహసీల్దార్‌ను ప్రతివాదిగా చేస్తూ బెయిలబుల్ వారెంట్‌ను అందిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. వచ్చే నెల 9వ తేదీ కోర్టుకు హాజరుకావాలని నోటీసు పంపించారు. ఈ విషయంపై వివరణ కోరగా.. ఆ కేసు విషయంలో కోర్టుకు హాజరై వాస్తవాలను వెల్లడిస్తామని కళ్యాణదుర్గం ఇన్‌ఛార్జ్ తహసీల్దార్ ఫణికుమార్ స్పష్టం చేశారు.

ఘనంగా డెంగీ నివారణ మాసోత్సవాలు



రాకెట్లలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారి, సిబ్బంది

ఉరవకొండ/రూరల్: ఉరవకొండ, రాకెట్ల గ్రామాల్లో డెంగీ నివారణ మాసోత్సవాల ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఉరవకొండ పట్టణంలోని పంచాయతీ కార్యాలయం నుంచి ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ అధికారి కోదండరామిరెడ్డి ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభిచారు. ర్యాలీలో ఎంపీపీ చందాచంద్రమ్మ, సర్పంచ్ లలితమ్మ, ఎంపీడీఓ వరలక్ష్మి, ఈఓ గౌస్‌సాహెబ్ పాల్గొన్నారు. ఈసందర్భంగా వైద్య సిబ్బంది పట్టణంలో ఇంటింటికీ వెళ్లి డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని ప్రజలకు కరపత్రాలు అందజేశారు. డెంగీ ప్రబలకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. అలాగే రాకెట్లలో నిర్వహించిన ర్యాలీలో వైద్యాధికారి డాక్టర్ వెంకటేష్, సీహెచ్ఓ నాగరంగయ్య, హెల్త్ ఎడ్యుకేటర్ ఎస్ఎండీ షఫీ పాల్గొన్నారు.

పక్కా ఇళ్లు ప్రారంభించిన స్పెయిన్ బృందం



పక్కా ఇళ్లను ప్రారంభిస్తున్న స్పెయిన్ దేశస్తులు

కళ్యాణదుర్గం: మండలంలోని పాపంపల్లిలో శుక్రవారం 19 పక్కా గృహాలను స్పెయిన్‌కు చెందిన 26 మంది మిత్రబృందంతో కలసి ప్రారంభించారు. ఆర్డీటీ హౌసింగ్ డైరెక్టర్ రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ స్పెయిన్‌కు చెందిన దాతల సాయంతో ఇళ్లను నిర్మించడం గొప్ప విషయమన్నారు. రీజినల్ డైరెక్టర్ లక్ష్మణరావు, ఎస్టీఎల్‌లు నారాయణస్వామి, క్రిష్టయ్య, ఏటీఎల్ మీనాక్షి, సీఓ శోభ, ఈఎస్‌జీ శివకుమార్, సంస్థ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

పెరాలసిస్ బాధితుడికి చేయూత

శెట్టూరు: మండల కేంద్రానికి చెందిన బేకరీ నాగరాజు పెరాలసిస్ వ్యాధితో బాధపడుతూ మంచానికి పరిమితమయ్యాడు. విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు బద్దే నాయక్ బాధితుని ఇంటికి వెళ్లి నిత్యావసర సరుకులు, నెల రోజులకు సరిపడా మందులు, రూ.10 వేల నగదు అందించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడిని పలువురు అభినందించారు.

పౌష్టికాహారం సక్రమంగా అందించండి

కంబదూరు: రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలకు అందించే పౌష్టికాహారాన్ని సక్రమంగా పంపిణీ చేయాలని కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్లు జ్యోతిలక్ష్మి, లక్ష్మిదేవి, పద్మావతమ్మ సూచించారు. మండల కేంద్రంలో అంగన్‌వాడీ కార్యకర్తలతో సెక్టార్ సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఆగస్టు 4 నుంచి పౌష్టికాహారం కిట్లను ఇంటి వద్దకే పంపిణీ చేయాలన్నారు. అలాగే అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణులు,బాలింతలకు ఆరోగ్యం పట్ల అవగాహన కల్పించాలన్నారు.

31న డెంగీ మాసోత్సవాలపై ర్యాలీ

విడపనకల్లు: పాల్తూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఈ నెల 31న డెంగీ మాసోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్నట్లు ఉరవకొండ మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ కోదండరాంరెడ్డి శుక్రవారం తెలిపారు. కార్య క్రమానికి జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి, జిల్లా వైద్యాధికారి యుగంధర్, జిల్లా పంచాయతీ అధికారి ప్రభాకర్‌రావు, ఐసీడీఎస్ జిల్లా ప్రాజెక్టు అధికారి శ్రీదేవి, గుంతకల్లు డీఎస్పీ నరసింగప్ప, ఇతర ప్రముఖులు ముఖ్య అతిథులుగా హాజరవుతారన్నారు.

రైతుల ఖాతాల్లోకి పీఎం కిసాన్ నగదు

కంబదూరు: మండలంలో 11,178 మంది రైతులకు పీఎం కిసాన్ కింద రూ.2 వేల రూపాయల చొప్పున ఆర్థిక సాయం మంజూరైయిందని మండల వ్యవసాయాధికారి శుక్రవారం తెలిపారు. నగదును వ్యవసాయ పనులకు ఉపయోగించుకోవాలని సూచించారు.

గ్రామీణులకు ఆధునిక వైద్య సేవలు

కంబదూరు: ఫ్యామిలీ డాక్టర్ విధానం కార్యక్రమం ద్వారా గ్రామీణులకు ఆధునిక వైద్య సేవలు ఇంటి వద్దకే వెళ్లి అందిస్తున్నామని డాక్టర్ ప్రసన్నకుమార్ తెలిపారు.శుక్రవారం మండలంలలోని రాళ్లఅనంతపురం గ్రామంలో ఫ్యామిలీ డాక్టర్ విధానం కార్యక్రమంలో భాగంగా 104 ద్వారా 52 మంది రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల నిరసన

కళ్యాణదుర్గం రూరల్: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ విద్యుత్ ఉద్యోగులు స్థానిక విద్యుత్ భవన్ ఎదుట శుక్రవారం నిరసన చేపట్టారు. ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసనకు దిగారు. కార్యక్రమంలో ఉద్యోగులు రాఘవరెడ్డి, జీవీ రమణ, సీకే నాగేంద్ర, గోపీనాథ్, శివలింగేశ్వర, భాస్కర్, హర్ష తదితరులు పాల్గొన్నారు.